

## పదో తరగతి పరీక్షకు 11 మంది గైర్హాజరు

భూపాలపల్లిటౌన్, మార్చి 23: జయశంకర్ భూ పాలపల్లి జిల్లాలో శనివారం జరిగిన పదో తరగతి గణి తం పరీక్షకు 3,536 మంది విద్యార్థులు హాజరయ్యారని విద్యాశాఖ జిల్లా అధికారి (డీఈవో) రామ్‌కుమార్ తెలి పారు. జిల్లా వ్యాప్తంగా 3,547 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 11మంది విద్యార్థులు గైర్హాజరయ్యార ని పేర్కొన్నారు. జిల్లాలోని మూడు పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో కలిసి తనిఖీ చేశామని వివరించారు.

ఇంటర్వ్యూ

# ఓటింగ్ శాతం పెంచుతాం..







- ప్రతీ ఒక్కరు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం
- చైతన్యం కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు
- ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నాం
- అందుబాటులో కంట్రోల్ రూమ్‌లు, 1950 టోల్ ఫ్రీ నెంబరు
- ఏప్రిల్ 15వరకు కొత్త ఓటరు నమోదుకు అవకాశం
- వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

మే నెలలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫిర్యాదులు, సమాచారం, సహాయం కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శనివారం 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎన్నికల గురించి పలు విషయాలను చర్చించారు. - ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7

- కొన్నిచోట్ల నేడు.. మరికొన్ని ప్రాంతాల్లో రేపు..
- నేడు కామదహనం.. ఆలయాల్లో పౌర్ణమి హోమాలు, పూజలు
- రసాయన రంగులతో ప్రమాదమంటున్న పర్యావరణ వేత్తలు

# ఆనందాల కేళి.. హోలీ..

### రంగుల పండుగకు సర్వం సిద్ధం





రంగుల పండుగ వచ్చింది.. హోలీ వేడుకలు సంబురంగా జరుపుకునే వేళ ఆసన్నమైంది. కొన్నిచోట్ల ఆదివారం (నేడు), కొన్నిప్రాంతాల్లో సోమవారం (రేపు) హోలీని ఆడుకోవడానికి ప్రజలు సన్నద్ధమయ్యారు. ఈ పండుగ పురాణ ఇతిహాసాల్లోనూ చోటు సంపాదించుకుంది. తెలుగు మాసాల్లో చివరిదైన 'ఫాల్గుణ మాసం' అంటే శ్రీమహావిష్ణువుకు మహా ఇష్టమని ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఈ మాసంలోనే స్వామికి ప్రీతిపాత్రమైన లక్ష్మీదేవి ఉద్భవించిందని, అందుకే లక్ష్మీనారాయణుల ఆరాధనకు ఈమాసం అన్ని విధాలా అనుకూలమని చెబుతారు. ఈ వేడుకని జరుపుకొనే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఆరోగ్యానికి హానికలిగించే, రసాయనాలు కలిసిన రంగులను వాడొద్దని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే రంగులు పూసుకొని మద్యం సేవించి వాహనాలతో రోడ్లపై విచ్చలవిడిగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు కూడా సిద్ధమయ్యారు.

- మహబూబాబాద్ ఎడ్యుకేషన్ / వరంగల్ కల్చరల్

7

## ముమ్మరంగా వాహన తనిఖీలు



ఏటూరునాగారం- బూర్గంపహాడ్ ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మంగపేట, మార్చి 23: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు ఆదివారం తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. బ్రాహ్మణపల్లి ఫారెస్ట్ చెక్‌పోస్ట్, మల్లూరు, తిమ్మంపేట, బోరునర్సాపురం, కోమటిపల్లి క్రాస్‌రోడ్, బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై గురువారం రాత్రంతా ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. మంగపేట ఎస్సై గోదారి రవికుమార్ నేతృత్వంలో సివిల్, సీఆర్పీఫ్ సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు.

## సింహవాహనంపై లక్ష్మీనరసింహుడు

### కోటంచ ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



సింహవాహనంపై లక్ష్మీనరసింహస్వామి ఊరేగింపు

రేగొండ, మార్చి 23: మండలంలో కోటంచ ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభ వంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా లక్ష్మీనరసింహస్వామిని శనివారం సింహవాహనంపై ఊరేగించారు. ప్రధానార్చకుడు బుచ్చమాచార్యులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం రాత్రి జరిగిన గరుడోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, జాతర కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, కమిటీ సభ్యులు మల్లెబోయిన శ్రీధర్, మూల ఓంకార్, డోబిలి వెంకటేశ్వరరావు, కనుకుంట్ల జోగేందర్, పేరాల తిరుపతి, పొలుసాని శ్రీనావాసరావు, లింగంపల్లి తిరుపతిరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాళేశ్వరాలయంలో నవగ్రహ పూజలు



నవగ్రహ పూజల్లో పాల్గొన్న భక్తులు

మహదేవపూర్, మార్చి 23: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం నవగ్రహ పూజలు జరిగాయి. శనివారంతో కూడిన త్రయోదశి రావడంతో ఈ ప్రత్యేక పూజలను నిర్వహించారు. శని త్రయోదశి సందర్భంగా నవగ్రహ పూజలు నిర్వహిస్తే శుభాలు కలుగుతాయనే నమ్మకంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో శనివారం 502 నవగ్రహ పూజా టికెట్లు, 109 కాలసర్పదోష నివారణ పూజలు, 130 అభిషేకాలు, 28 కుంకుమ పూజా టికెట్లు విక్రయించగా రూ. 2.90 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

## ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### భూపాలపల్లి జిల్లా కోర్టు జడ్జి జయరాంరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జయరాంరెడ్డి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 23: కక్షిదారులు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి జిల్లా జడ్జి జయరాంరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా జడి మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందుతున్న సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్‌ల ద్వారా రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవాలన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యారులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల్లో ట్యాపింగ్ టెన్షన్!

- వ్యవహారంలో వెలుగులోకి ఒక్కొక్కరి పేర్లు
- వరంగల్ ఖాకీలను వణికిస్తున్న లింకులు
- ప్రణీత్‌తో పాటు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పేరూ తెరపైకి
- భూపాలపల్లి ఏఎస్పీ భుజంగరావుకూ భాగస్వామ్యం
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఇద్దరు సీఐల ప్రమేయం, పర్వతగిరి వార్ రూమ్‌పై ఆరా



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసు వరంగల్ పోలీసులను ఓ కుదుపు కుదుపుతోంది. ఈ వ్యవహారంలో లింకులు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండగా.. నాటి అధికారపక్షం అండతో.. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాప్ చేశారన్న ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌లో విచారిస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన పలువురు పోలీసుల అధికారుల పేర్లు తెరపైకి వస్తుండగా, పర్వతగిరి వార్‌రూమ్‌పై విచారణ చేస్తే మరికొందరు పోలీసుల ప్రమేయం కూడా బయటకు వస్తుందన్న అభిప్రాయాల మధ్య పోలీసుల్లో టెన్షన్ కనిపిస్తోంది.

### వ్యవహారంలో కొందరు వరంగల్ పోలీసులే కీలకం

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రణీత్‌రావుది వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడపల్లి కాగా, ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న టి.ప్రభాకర్‌రావు కూడా కీలక పాత్రధారియేనని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో గుర్తించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉన్న ప్రభాకర్‌రావు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ప్రభాకర్‌రావుది హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామం కాగా 2020జూన్ 30న పదవీవిరమణ చేశారు. అయితే అప్పటి సీఎం కేసీఆర్‌తో ఉన్న సత్సంబంధాలతో ప్రభాకర్‌రావును ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. పై అధికారుల ఆదేశాల మేరకే ట్యాపింగ్ చేసినట్లు ప్రణీత్‌రావు పోలీసుల విచారణలో పేర్కొనటంతో ప్రభాకర్‌రావు ఇంట్లో తనిఖీలు చేపట్టడం వరంగల్ పోలీసుల్లో చర్చనీయాంశమైంది. ఇదే చర్చ జరుగుతున్న క్రమంలో భూపాలపల్లి ఏఎస్పీ భుజంగరావు సైతం ఫోన్ ట్యాపింగ్‌లో భాగస్వామ్యమయ్యారని దర్యాప్తు బృందం గుర్తించటంతో పాటు ఆయన అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. ఐదు నెలల క్రితమే భుజంగరావు భూపాలపల్లికి బదిలీపై రాగా.. వచ్చినప్పటి నుంచే ట్యాపింగ్ కేసు దర్యాప్తు ప్రారంభం కావటంతో భూపాలపల్లి కంటే ఎక్కువ సమయం హైదరాబాద్‌కే పరిమితమైనట్లు సమాచారం. అలాగే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో భాగంగా వరంగల్ జిల్లా పర్వతగిరిలో వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. ప్రణీత్‌రావు తన బంధువుల ఇంట్లో ఈ వార్‌రూమ్ ఏర్పాటు చేసి కొందరి సహకారంతో ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ప్రచారం జరుగుతోంది. ఇదే కోణంలో దర్యాప్తు బృందం విచారించి రికార్డు చేసినట్టు తెలుస్తోంది. వరంగల్ కమిషనరేట్‌లో పని చేస్తున్న ఇద్దరు సీఐలు ప్రమేయం ఉందని, వారిని అదపులోకి తీసుకున్నారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ప్రణీత్‌రావును శనివారం వరకే పోలీసు కస్టడికి కోర్టు అనుమతిచ్చింది. ఈ తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని సేకరించిన దర్యాప్తు బృందం మంగళవారం నుంచి రెండో విడత విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ఈ విడతలో పర్వతగిరి వార్‌రూమ్‌కు సహకరించిన ఖాకీల వివరాలు బయటకొచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతుండగా.. ఫోన్‌ట్యాపింగ్ లింకులు ఎవరెవరికి ఉన్నాయోనన్న ఉత్కంఠ మరింత పెరుగుతోంది.

## ఇసుక లారీలను అడ్డుకున్న గిరిజనులు



ఇసుక లారీలను అడ్డుకొని నిరసన తెలుపుతున్న గిరిజనులు

వాజేడు, మార్చి 23: మండల పరిధిలోని ధర్మవరం ఇసుక సొసైటీలో పనికల్పించాలని కోరుతూ భీమవరం గిరిజనులు శనివారం ఆందోళనకు దిగారు. ఇసుక సొసైటీ వద్ద లోడింగ్ కోసం వచ్చిన లారీలను అడ్డు కున్నారు. గిరిజనులమైన తాము సంతకాలు చేస్తేనే ఇసుక సొసైటీ మంజూరైందని, ఇప్పుడు తమకే పనిలేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక సొసైటీకి సంబంధం లేని వ్యక్తులకు పని కల్పిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఇటీవల కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవోను కలిసి తమ సమస్యను విన్నవించామని తెలిపారు. దీనిపై స్పందించిన పీవో తక్షణమే భీమవరం గిరిజనులకు పని కల్పించాలని సంబంధిత ఇసుక రేజింగ్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారని అన్నారు. ఈ క్రమంలో శనివారం ఇసుక సొసైటీ వద్దకు పని కోసం వెళ్తే అక్కడున్న వారు తమను అడ్డుకుంటున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. భీమవరం గిరిజనులు ఆందోళన చేయటంతో లోడింగ్ కోసం వచ్చిన లారీలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో అక్కడకు చేరుకున్న కాంట్రాక్టరు వారితో చర్చించాడు. ఆదివారంలోగా ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

## డీఆర్‌డీఏ పీడీ పురుషోత్తం సస్పెన్షన్



పురుషోత్తం

మహబూబాబాద్ రూరల్, మార్చి 23 : జిల్లా డీఆర్‌డీఏ పీడీగా విధులు నిర్వహిస్తున్న పురుషోత్తంను సస్పెండ్ చేస్తూ శనివారం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లాలో పీడీగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆర్థిక, విధుల్లో నిర్లక్ష్యం, రికార్డులను అందించకపోవడం లాంటి అంశాలపై విచారణ చేపట్టగా, నిధులు దుర్వినియోగమైనట్లు తేలడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. కాగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గత ఫిబ్రవరి 13న రాష్ట్రవ్యాప్తంగా డీఆర్‌డీఏ పీడీలు, జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోల బదిలీలు చేశారు. అందులో భాగంగా భూపాలపల్లి జిల్లా పీడీగా పనిచేస్తున్న పురుషోత్తం మహబూబాబాద్ జిల్లా డీఆర్‌డీఏ పీడీగా బదిలీపై వచ్చారు.

## సీఐ సంపత్‌పై సస్పెన్షన్ వేటు

### బాలికపై అత్యాచార యత్నం ఘటనలో పోక్సో కేసు నమోదు



సీఐ సంపత్

వరంగల్ క్రైం, మార్చి23: బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడి పోక్సో కేసులో అరెస్టయిన భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం సీఐ బండారి సంపత్‌కుమార్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కేయూ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో పరిచయమైన మహిళతో సంపత్‌కుమార్ సహజీవనం చేస్తున్నాడు. ఆ మహిళకు మైనర్ కూతురు ఉంది. మహిళతో సహజీవనం చేస్తున్న సంపత్‌కుమార్ కన్ను బాలికపై పడింది. ఇటీవల సీఐ సంపత్‌కుమార్ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కూతురు ద్వారా తెలుసుకున్న మహిళ.. కేయూ పోలీస్‌స్టేషన్‌లో సంపత్‌కుమార్‌పై ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. గురువారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. శాఖాపర మైన చర్యలో భాగంగా ఐజీ రంగనాథ్ సీఐ సంపత్‌ను సస్పెండ్ చేశారు.

## బైక్‌ను ఢీకొన్న కారు

### ముగ్గురు వలస కూలీలకు గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వెంకటాపురం(నూగూరు), మార్చి 23: బైక్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురు వలస కూలీలు గాయపడిన సంఘటన మండలంలోని పాత్రాపురం గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద శనివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పూసూరు గ్రామానికి చెందిన వలస కూలీలు కట్టం నారాయణ, గట్టుపల్లి నా గులు, అర్జన్ వెంకటాపురం నుంచి చర్ల వైపు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. పాత్రాపురం బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే చర్ల నుంచి వెంకటాపురం వస్తున్న కారు వారి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న నారాయణ, నాగులు, అర్జున్ గాయాల య్యాయి. దీంతో స్థానికులు గాయపడ్డవారిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## అగ్గి.. రాజుకుంటే బుగ్గే

- భూపాలపల్లి జిల్లాలో రెండు అగ్నిమాపక కేంద్రాలు మాత్రమే..
- మారుమూల ప్రాంతాలకు సకాలంలో చేరుకోలేని ఫైరింజన్లు
- మరో రెండు ఫైర్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని సర్వత్రా డిమాండ్

వివరాలు 8వ పేజీలో...



### రంజాన్ వేళలు

| | | |
|---|---|---|
| ఇఫ్తార్ : | ఆదివారం | సా : 6.33 గం. |
| సహర్ : | సోమవారం | ఉ : 4.54 గం. |

# ఆనందాల కేళి.. హోలీ..

## రంగుల పండుగకు సర్వం సిద్ధం ● నేడు కామదహనం, ఆలయాల్లో పూజలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్/వరంగల్ కల్చరల్, మార్చి 23: హోలీ పూర్ణిమ పండుగను జరుపుకొనేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు సిద్ధమయ్యారు. సోమవారం హోలీ పండుగ నేపథ్యంలో ఆదివారం కాముని పున్నం సందర్భంగా కామ దహనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పురాణాల కాలం నుంచి వర్గ బేధాలకు తావులేకుండా స్నేహభావాన్ని పెంపొందించే వేడుకగా పాల్గుణ మాసంలో జరుపుకొనే ఈ పండుగ. పాల్గుణ పౌర్ణమి అంటే ఒక విశిష్టతతో కూడిన పండుగ. పౌర్ణమి తోడు కావడంతో ఆ రోజున ఆలయాల్లో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, అర్చనలు, వ్రతాలను ఆచరిస్తారు. చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారికి వసంతోత్సవ వేడుకను నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇతర దేవాలయాల్లో కూడా పౌర్ణమి పూజలు, ప్రసాద వితరణలు ఏర్పాటు చేశారు. అలాగే హోలీ పండుగ రోజున దేవుడి ఆశీర్వాదంగా మూడేళ్లలోపు చిన్నారులకు బిస్కెట్లతో తయారు చేసిన దండలను మెడలో వేస్తారు. తెలంగాణ ప్రాంతంలో హోలీ పండుగలో ఇది సంప్రదాయంగా వస్తోంది.

### రెండు రోజులు వేడుకలు

హోలీ పండుగ ఏరోజు జరుపుకోవాలన్న విషయంలో ప్రతీ సారిలాగే ఈసారి కూడా కొంత అయోమయం నెలకొంది. ఈ ఏడాది పౌర్ణమి ఆదివారం, సోమవారం రెండు రోజులు ఉండగా కొందరు ఆదివారమే ఈ పండుగ జరుపుకోనుండగా మరికొన్ని చోట్ల సోమవారం హోలీ జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

### కామదహనం ఎందుకంటే..

ఫాల్గుణ శుద్ధ చతుర్థశి రోజున 'కామదహనం', ఫాల్గుణ పౌర్ణమినాడు కాముని పున్నమి పేరిట సంబరాలు జరుగుతాయి. లోకకల్యాణం కోసం పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపించాలని దేవతలు నిర్ణయిస్తారు. పార్వతిదేవిపై పరమశివుడి దృష్టి నిలిచేలా చేయమని మన్మథుడిని కోరుతారు. అలవాటు ప్రకారం శివుడిపైకే మన్మథుడు బాణాన్ని ప్రయోగించి, ఆయనకు తపోభంగం చేస్తాడు. ఆగ్రహావేశాలకు లోనైన శివుడు మూడో కన్ను తెరిచి మన్మథున్ని భస్మం చేస్తాడు. అలా కోరికలు దహింపజేసిన రోజు కావడం వల్ల ఆ రోజు 'కామదహనం' పేరుతో మన్మథుడి బొమ్మను గడ్డితో చేసి తగులబెడతారు

### పురాణాల్లో ఇలా..

పురాణాల్లో హోలీ పండుగకు వెనుక ఓ కథ ప్రచారంలో ఉంది. రాక్షసులకు రాజైన హిరణ్యాకశవుడు సుదీర్ఘ కాలం తపస్సు చేసి పగలు, రాత్రి, ఇంటా, బయట, భూమిపై, ఆకాశంలో, మనుషులు, జంతువులు, అస్త్రాలు, శస్త్రాలతో చావులేని వరాన్ని బ్రహ్మదేవుడిచే పొందుతాడు. ఆ అహంకారంతో స్వర్గం, భూమిపై దాడిచేసి ప్రజలంతా దేవుళ్లను ఆరాధించడం మానేసి తననే పూజించాలని ఆజ్ఞాపిస్తాడు. తన కుమారుడైన ప్రహ్లాదుడు విష్ణుమూర్తి భక్తుడు కావడంతో అతన్ని కూడా చంపించేందుకు అనేక ప్రయత్నాలు చేసి విఫలమవుతాడు. ఆ క్రమంలో హిరణ్యకశపుడి సోదరి హోలీక ఒడిలో చితిలో కూర్చోవాలని ప్రహ్లాదున్ని ఆజ్ఞాపిస్తాడు. మంటల నుంచి రక్షించే శాలువా ఆమె ధరించి ఉండడం వల్ల ఎలాంటి హానీ ఆమెకు మాత్రం జరగదని హిరణ్యకశపుడి నమ్మకం. తండ్రిమాట ప్రకారం హోళిక ఒడిలో కూర్చుని చితిలోకి వెళ్లడానికి అంగీకరించిన ప్రహ్లాదుడు తనను రక్షించాలని విష్ణుమూర్తిని వేడుకుంటాడు. ఆమె చితిలో కూర్చోగానే హోళిక శాలువా ఎగిరిపోయి ప్రహ్లాదున్ని కప్పుతుంది. హోళిక అందరి ముందే మంటల్లో కాలిపోతుంది. రాక్షసి అయిన హోళిక దహనం సందర్భంగా ఈ 'హోలీ' పండుగ జరుపుకుంటున్నట్లు విశ్వసిస్తారు.

### కృత్రిమ రంగులతో ప్రమాదం

హోలీకి వినియోగించే రంగుల్లో వివిధ రసాయనాలు ఉండి చర్మవ్యాధులు, రోగాలను కలిగిస్తాయి. సహజసిద్ధంగా లభించే వనరులతో హోలీ పండుగను జరుపుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రసాయనాలకు సంబంధించి పారిశ్రామికంగా తయారైన కృత్రిమ రంగులవల్ల కలిగే దుష్ప్రభావాలు తెలుసుకుని ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే పదార్థాల నుంచి సురక్షితమైన రంగులను ఏ విధంగా చేయవచ్చో తెలుసుకుని ఆ రంగులనే ఉపయోగించుకుంటే ఇటు ఆరోగ్యానికి, అటు పర్యావరణానికి మేలు జరుగుతుంది. రసాయన రంగుల్లో నలుపు లెడ్ ఆక్సైడ్ ద్వారా కిడ్నీ పాడైపోయే ప్రమాదముంది. ఆకుపచ్చ కాపర్ సల్ఫేట్ ద్వారా కళ్ల దురద రావచ్చు, తాత్కాలింగా చూపుపోవచ్చు. సిల్వర్ అల్యూమినియం బ్రోమైడ్‌తో క్యాన్సర్‌కు దారితీసే లక్షణం చోటు చేసుకుంటాయి. నీలం పర్షియన్ బ్లూతో చర్మసంబంధ వ్యాధి, ఎరుపు మెర్క్యూరీ సల్ఫేట్‌తో చర్మక్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.



సహజ రంగుల తయారీకి ఉపయోగించే మోదుగు పూలు (ఫైల్)

### సహజరంగు తయారీ

మోదుగుపువ్వు ప్రస్తుత వేసవి కాలంలో చాలా ప్రాంతాల్లో లభ్యమవుతుంది. దీనిని వేడినీళ్లలో ఉడికిస్తే ఎరుపురంగు వస్తుంది. దీనిని హోళీ రంగుగా ఉపయోగించవచ్చు. దీంతో ఏ విధమైన ఇబ్బందీ ఉండదు. వావిలాకు, జామాయిల్ ఆకులను ఉడికిస్తే ఎరుపు, పసుపు రంగులు లభిస్తాయి. ఇవి ఆరోగ్యానికి కూడా మంచివి. బీట్‌రూట్‌ను ముక్కలుగా తరిగి నీళ్లలో వేస్తే ఎరుపు రంగు నీరు లభ్యమవుతుంది. గులాబీ రేకులు నానబెట్టి కూడా రంగులు పొందవచ్చు.





వరంగల్ నగరంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగులు చల్లుకునే బొమ్మ పైపులు, రంగులు

# ఓటింగ్ శాతం పెంపునకు కృషి

## వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటి ఓటు హక్కును ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవగాహన కల్పించడంతో పాటు ఏర్పాట్లు చేస్తున్నామని, ఫలితంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య స్పష్టంచేశారు. ఇక ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు చేసేందుకు, ఓటరుకు సహాయంగా ఉండేందుకు ప్రత్యేకంగా యాప్‌లను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందని, అలాగే 24గంటలు అందుబాటులో ఉండే కంట్రోల్‌రూమ్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు యంత్రాంగం అనుసరిస్తున్న ప్రణాళి గురించి ఆమె శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: వరంగల్ లోక్‌సభ ఎన్నికల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

కలెక్టర్ : మే 13న జరిగే పోలింగ్ నిర్వహణతో పాటు ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిసి మొత్తం 18,16,500మంది ఓటర్లు ఉండగా, 1,899 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. వీటిలో 419 సమస్యాత్మక కేంద్రాలున్నట్లు గుర్తించాం. ఎన్నికల నిర్వహణ కోసం 10వేల మంది సిబ్బందిని సిద్ధం చేస్తున్నాం. 130శాతం ఈవీఎంలు, వీవీప్యాట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే అన్ని ఈవీఎంల పనితీరును పరిశీలించాం. ఎక్కడా ఈవీఎంలు మొరాయించకుండా చర్యలు చేపట్టాం. పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఓటింగ్ శాతం పెంపుదలకు తీసుకుంటున్న చర్యలు గురించి?

కలెక్టర్ : ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గత లోక్‌సభ ఎన్నికల్లో 63.7శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి ఆ పోలింగ్‌శాతాన్ని పెంచడంపైనే దృష్టి పెట్టాం. ఇప్పటికే పలు రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు సంకల్ప్ పత్రాలు అందిస్తున్నాం. 340క్యాంపస్ అంబాసిడర్లు, ఓటర్ అవేర్నస్ ఫోరంలను ఏర్పాటు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల కంటే వరంగల్ మహానగరంలో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటోంది. కానీ ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. మెప్మా సహకారంతో మహిళాసంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఓటర్లు పోలింగ్‌కు వచ్చేలా అవగాహణ కల్పిస్తున్నాం. అలాగే భూపాలపల్లి నియోజకవర్గంలోనే 10 నక్సల్స్ సమస్యాత్మక కేంద్రాలు, నాలుగు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరిపించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : ఎన్నికల ఫిర్యాదులు, సహాయానికి సంబంధించి..?

కలెక్టర్ : ఓటర్లకు 24గంటలపాటు అందుబాటులో ఉండేలా వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగామ జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశాం. టోల్ ఫ్రీ నెంబరు 1950కి కాల్‌చేసి కూడా ఫిర్యాదులు చేయవచ్చు, సహాయం కూడా పొందవచ్చు. అలాగే సి-విజిల్ యాప్ ద్వారా కూడా ఎన్నికల సంబంధించిన ఫిర్యాదులు చేయొచ్చు. ఈ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. అలాగే రాజకీయ పార్టీల కోసం సువిధ యాప్ అందుబాటులో ఉంది. ఈ యాప్ ద్వారా ఎన్నికల ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అలాగే ఓటర్ల కోసం ఓటరు హెల్ప్ లైన్ యాప్ కూడా అందుబాటులో ఉంది.

ఆంధ్రజ్యోతి : ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీ అమలుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

కలెక్టర్ : వరంగల్ లోక్‌సభ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలైన ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ తోపాటు అకౌంట్స్ టీమ్స్, సెక్టార్ ఆఫీసర్ల నియామకం చేశాం. అలాగే పోలీసుశాఖతో కలిసి కీలకమైన ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఎన్నికల నియమావళిపై ఇప్పటికే రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించాం. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, వాల్ రైటింగ్స్, పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఫ్లాగ్స్ తొలిగిస్తున్నాం. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, ఎంసీఎంసీ కమిటీలను ఏర్పాటు చేశాం. ప్రతీ ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియామవళిని పాటించాలి.

ఆంధ్రజ్యోతి : ఓటరు నమోదుకు ఇంకా సమయం ఉందా..?

కలెక్టర్ : అవును ఇంకా సమయం ఉంది. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదవ్వొచ్చు. గతంలో జనవరి 1వ తేదీ వరకు 18ఏళ్లు నిండిన వారికే అవకాశం ఉంది. కానీ ఈసారి ఏప్రిల్ 1వ తేదీ వరకు 18ఏళ్లు నిండిన వారు అర్హులవుతారని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటరు నమోదుకు గడువున్న నేపథ్యంలో అవకాశాన్ని వినియోగించుకోవాలి. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి కూడా ఓటరు గుర్తింపు కార్డులు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే ఫాం- 18 ద్వారా చేర్పులు, మార్పులు చేసుకునే వారికి మార్చి 25వ తేదీ వరకు గడువుంది.

# ఎంహెచ్ నగర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు

## దాడి చేసిన పోలీసులు.. డాక్టర్, నర్సుపై కేసు

## మొబైల్ స్కానింగ్ మిషన్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న స్కానింగ్ మిషన్

వరంగల్ మెడికల్, మార్చి 23: వరంగల్ దేశాయిపేట ఎంహెచ్ నగర్‌లో ఓ స్కానింగ్ సెంటర్‌పై పోలీసులు దాడి చేసినట్లు తెలిసింది. ఈ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు అందిన పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం ఓ మహిళా కానిస్టేబుల్‌తో పాటు మరో కానిస్టేబుల్ మఫ్టీలో వెళ్లినట్లు సమాచారం. మొత్తం స్కానింగ్ సెంటర్‌లో ఆ సమయంలో ముగ్గురు గర్భిణులు ఉన్నట్లు తెలిసింది. అనంతరం అక్కడ గర్భ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చాక మఫ్టీలో ఉన్న పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు రంగ ప్రవేశం చేసి మొబైల్ స్కానింగ్ మిషన్ స్వాధీనం చేసుకోవడంతోపాటు వైద్యురాలు, నర్సును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈలోగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి సమాచారం చేరవేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు ధ్రువీకరించేందుకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో కూడిన ఒక బృందాన్ని అక్కడికి పంపారు. ఈ బృందం కూడా లింగ నిర్ధారణ పరీక్షలు జరిపినట్లు ధ్రువీకరించారని విశ్వసనీయ సమాచారం. కాగా, ఈ స్కానింగ్ సెంటర్‌పై డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాలరావు ఇంతేజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైద్యురాలు డాక్టర్ సబిత, నర్సు మాధవిపై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు.

# శ్యామలచంద్రకు డాక్టరేట్

కేయూ క్యాంపస్, మార్చి 23: ఉస్మానియా యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం పరిశోధకురాలు రొక్కల శ్యామలచంద్రకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు శ్యామల చంద్రకు డాక్టరేట్‌ను ప్రకటించినట్లు శనివారం ఓయూ పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. 'ఆ కంప్రెహెన్సివ్ స్టడీ ఆన్‌ద సింథసిస్ ఆఫ్ గమ్ కారయ బయో కంపోసిట్ సిల్వర్ నానోపార్టీకలస్ అండ్ ఇట్స్ బయోలాజికల్ అపికేషన్స్' అనే అంశంపై ఓయూ బయో కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కరుణ. రూపుల పర్యవేక్షణలో శ్యామల చంద్ర డాక్టరేట్ పూర్తిచేశారు. డాక్టరేట్ పొందిన శ్యామల చంద్రను పలువురు అభినందించారు.

# మెడికల్ షాపు లైసెన్స్ సస్పెన్షన్

వరంగల్ మెడికల్, మార్చి 23: డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ రూల్స్ అతిక్రమించినందుకు కాజీపేట బాపూజీ నగర్‌లోని మెడ్ ప్లస్ లైసెన్సును ఏడు రోజులపాటు సస్పెన్షన్ చేసినట్లు హనుమకొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జె.కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. ఒక ఔషధం అమ్మకంపై ఇన్వర్మేషన్ కొనుగోలు బిల్లు, సేల్స్ రిజిస్టర్ వివరాల కోసం ఔషధ నియంత్రణశాఖ నోటీసులు జారీ చేసింది. వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో డ్రగ్ అండ్ కాస్మోటిక్స్ రూల్స్ చట్ట ప్రకారం ఏడురోజులు లైసెన్స్ రద్దు చేసినట్లు ప్రకటించారు.

# అగ్గి రాజుకుంటే.. బుగ్గి కావాల్సిందే..

భూపాలపల్లి జిల్లాలో రెండు అగ్నిమాపక కేంద్రాలు మాత్రమే • మారుమూల ప్రాంతాలకు సకాలంలో చేరుకోని ఫైరింజన్లు



చిట్యాల, మార్చి 23 : వేసవి వచ్చిదంటే.. ప్రజలు హడిలిపోవాల్సిందే. ఎక్కడ ఎలాంటి అగ్ని ప్రమాదం జరిగినా సర్వం కోల్పోవాల్సిందే. భూపాలపల్లి జిల్లాలో తరచూ ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా భూపాలపల్లితోపాటు గణపురం మండలం చెల్పూరులో మాత్రమే అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మొత్తం మూడు ఫైరింజన్లు మాత్రమే ఉండటంతో ఏదైనా మారుమూల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు అవి వచ్చేలోపే విలువైన ఆస్తులు బుగ్గి అవుతున్నాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు ఉన్నాయి. వీటన్నిటికీ రెండు మాత్రమే ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి. భూపాలపలిలో ఒక అగ్నిమాపక కేంద్రం ఉండటగా అందులో ఒక ఫైరింజన్ ఉంది. గణపురం మండలం చెల్పూరులో జెన్కో ఆధ్వర్యంలో మరో అగ్నిమాపక కేంద్రం ఉండగా అందులో రెండు ఫైరింజన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు ఫైర్‌స్టేషన్లకు సగటున 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న పల్లెలే ఎక్కువ ఉన్నాయి. టేకుమట్ల, మహదేవపూర్ మండలాలు ఈ స్టేషన్లకు అత్యంత దూరంలో ఉంటాయి. దీంతో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు దూర భారం పెరిగి ఫైరింజన్లు సకాలంలో అక్కడికి చేరుకోలేకపోతున్నాయి. ఇటీవల చిట్యాల మండలం కైలాపూర్ శివారు శాంతినగర్‌లో అగ్ని ప్రమాదం జరగ్గా 40 కిలో మీటర్ల దూరం నుంచి ఫైరింజన్ వచ్చే సరికి ఇల్లంతా కాలిపోయి ఆ కుటుంబం సర్వం కోల్పోవడమే ఇందుకు నిదర్శనం. ఇలా జిల్లా వ్యాప్తంగా ఏడాది కాలంలో 252 ప్రమాదాలు జరిగాయని అగ్నిమాపక శాఖ లెక్కలు చెబుతున్నాయి.

### మరో రెండు కేంద్రాలు ఏర్పాటు చేస్తే..

జిల్లాలోని చిట్యాల, కాటారం మండల కేంద్రాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా ప్రజలు కోరుతున్నారు. ఈ రెండు మండల కేంద్రాలు జిల్లాలోని ఇతర మండలాలకు కేంద్ర బిందువుగా ఉంటాయి. ఎక్కడ ప్రమాదాలు జరిగినా గంటలోపే ఘటన స్థలానికి ఫైరింజన్లు చేరుకొనే అవకాశం ఉంది. దీంతో విలువలైన ఆస్తులను కాపాడుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి చిట్యాల, కాటారం మండల కేంద్రాల్లో ఫైర్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ఫైర్‌స్టేషన్‌లో ఉద్యోగుల కొరత

జిల్లాలోని రెండు ఫైర్ స్టేషన్లలో ఉద్యోగుల కొరత ఉంది.భూపాలపల్లి ఫైర్ స్టేషన్‌లో ఫైర్ ఆఫీసర్‌తోపాటు నాలుగు ఫైర్‌మెన్, రెండు డ్రైవర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చెల్పూరులోని ఫైర్‌స్టేషన్‌లో నాలుగు ఫైర్‌మెన్, రెండు డ్రైవర్ పోస్టులు భర్తీ కావాల్సి ఉన్నాయి. దీంతో ప్రస్తుతం ఆర్టీజన్ సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

**వెంటనే స్పందిస్తున్నాం..**



అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉంటున్నాం. సమాచారం అందిన వెంటనే స్పందిస్తున్నాం. ప్రమాద స్థలానికి వీలైనంత తొందరగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వెంటనే 101 నంబర్‌కు డయల్ చేయాలి.

- రాజా, అగ్నిమాపక అధికారి (చెల్పూర్)

## పోలీసు శాఖలో కలకలం

- పోక్సో కేసులో ఒకరు.. ఫోన్ ట్యాపింగ్‌లో మరొకరు
- వివాదాస్పదంగా ఖాకీల వ్యవహారం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 23: నేరాలను అరికట్టాల్సిన రక్షక భటులే శిక్షార్హులవుతున్నారు. వివాదాల్లో చిక్కుకుంటూ పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారు. వరుసుగా చోటుచేసుకుటున్న ఘటనలు సర్వత్రా కలకలం రేపుతున్నాయి. లైంగింక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో పోక్సో కేసును ఓ సీఐ ఎదుర్కొంటుండగానే మరో ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో జిల్లా అదనపు ఎస్పీ హస్తం ఉన్నట్లు వస్తున్న వార్తలు కలకలం సృష్టిస్తున్నాయి.

భూపాలపల్లి జిల్లాలో విధుల్లో చేరిన అనతికాలంలోనే ఇరువురు పోలీసు అధికారులు వివాదాల్లో చిక్కుకున్నారు. జిల్లా పోలీస్‌శాఖలోని వీఆర్ విభాగంలో పని చేస్తున్న సీఐ సంపత్ లైంగిక పోక్సో చట్టం కింద కేసు నమోదై కటకటాల్లోకి వెళ్లారు. ఈ వ్యవహారం తీవ్ర చర్చకు దారి తీసింది. ఇది మరువక ముందే జిల్లా పోలీసుశాఖలో ప్రధాన వింగ్‌లో ఓఎస్‌డీగా పనిచేస్తున్న భుజంగరావు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న ఫోన్ ట్యాపరింగ్ వ్యవహారంలో సంబంధం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని విచారించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే.. ఈ ఇరువురు అధికారులు భూపాలపల్లి భూపాలపల్లి జిల్లాలో విధుల్లో చేరిన కొద్ది రోజులకే వివాదాలు చుట్టుముడుతుండటం పోలీసుశాఖకు మాయని మచ్చ తెచ్చినట్టయిందనే విమర్శలు వస్తున్నాయి.

## కాళేశ్వరాలయంలో కల్యాణం

మహదేవపూర్, మార్చి 23: మహాశివరాత్రి సందర్భంగా శివ కల్యాణం నిర్వహించగా 16వ రోజైన శనివారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం జరిగింది. ప్రధాన అర్చకుడు పనకంటి నగేష్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో అర్చకుడు వెల్ది శ్యాం, వేద పండితుడు పాండే, ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## అక్రమంగా తరలిస్తున్న మద్యం సీజ్

ఏటూరునాగారం, మార్చి 23 : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఏటూరునాగారం చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీలు చేయగా ఏటూరునాగారం వైపు నుంచి వచ్చిన కారులో మద్యం లభ్యమైందని, దానిని సీజ్ చేశామని అధికారులు తెలిపారు. దీని విలువ రూ. 68,700 ఉంటుందని చెప్పారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న కొండా మహేందర్, ముక్కెర రవళిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ శాఖ సీఐ ఎల్. రామకృష్ణ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ సందీప్, కానిస్టేబుల్స్ తిరుపతి, నవీన్, నాగరాజు, వీరన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూముల లెక్క తేల్చాలి

**సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌నాయక్**

ములుగు కలెక్టరేట్, మార్చి 23: రాష్ట్రంలో భూదాన్ భూ ముల లెక్క తేల్చాలని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ములుగులో సర్వోదయ మండలి జిల్లా మహాసభలు జరగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గాంధీ, వినోబబావే ఆశయాలకు తిలోదకాలిచ్చి పేదవారికి పంచాల్సిన భూదాన్ భూములను రాజకీయ నాయకులు బడా వ్యాపారవేత్తల చేతుల్లో పెట్టారని ఆరోపించారు. ప్రభుత్వం భూదాన్ భూముల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిందన్నారు. గత ప్రభుత్వం చేసిన అక్రమాల లెక్కలు తేల్చి భూ బకాసురుల భరతం పట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో లక్షా79వేల ఎకరాల భూదాన్ భూములు ఉన్నాయని తెలిపారు. వాటిని కాపాడేందుకు భూదాన్ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలు, రైతులకు, నిర్వాసితులకు పంపిణీ చేయాలన్నారు. అనంతరం తెలంగాణ సర్వోదయ మండలి ములుగు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకిరెడ్డి వెంకటరామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మండల మధుకర్‌రెడ్డి, ప్రతినిధిగా వకులాభరణం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అంకూస్, చెన్న కిషోర్, సభ్యులుగా మొగులుట్ల శ్రీనివాస్, జూపాక రమేష్, చిగురు దేవేందర్, ఎలగొండ శంకర్, పోరిక శ్యామల్‌నాయక్ ఎన్నికయ్యారు.

## ఇసుక డంప్‌ల సీజ్

చిట్యాల, మార్చి 23: మండలంలోని పలు గ్రామాల్లో నిల్వ చేసిన ఇసుక డంప్‌లను పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు శనివారం సీజ్ చేశారు. మండలంలోని కాల్వపల్లి శివారు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లతో తరలించి గిద్దెముత్తారం, గోపాలపురం, దూత్‌పల్లి, కాల్వపల్లి శివారుల్లో డంప్ చేయగా ఎస్సై శ్రావణ్‌కుమార్, గిర్ధావర్ భాస్కర్ల రాజు సిబ్బందితో వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. వారి వెంట కానిస్టేబుల్ సిద్ధార్థ, పంచాయతీ కార్యదర్శి రవీందర్, రెవెన్యూ సిబ్బంది లక్ష్మీకాంత్ తదితరులు ఉన్నారు. అలాగే కాల్వపల్లి శివారు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని జడల్‌పేట వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రేగొండ మండలానికి చెందిన ట్రాక్టర్ యాజమాని రాదండి కుమారస్వామి, డ్రైవర్ జలుగూరి చిరంజీవిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రెండు ట్రాక్టర్ల పట్టివేత

టేకుమట్ల : మండలంలోని రామకృష్ణాపూర్ (వీ) గ్రామంలో ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన నలివెల నాగరాజు, చెక్క వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుల్ మధుకర్ ఉన్నారు.

## దేవునిగుట్ట జాతర పోస్టర్ ఆవిష్కరణ

ములుగు కలెక్టరేట్, మార్చి 23: ములుగు మండలంలోని కొత్తూరు గ్రామ శివారులో జరిగే దేవునిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి జాతర పోస్టర్‌ను శనివారం ములుగులో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ధనసరి సూర్య ఆవిష్క రించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బాదం ప్రవీణ్, నేపాల్‌రావు, బండి మధు, దేవస్థానం కమిటీ సభ్యులు వెంకటస్వామి, అక్కల పోశయ్య, గుండెబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన సీఐ

కాటారం, మార్చి 23: మండలకేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను కాటారం సీఐ నాగార్జునరావు శనివారం తనిఖీ చేశారు. ఆదర్శ హైస్కూల్, జడ్పీహెచ్ఎస్, గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు చేపట్టిన బందోబస్తును సీఐ పర్యవేక్షించారు. 144సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ఎవరూ గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై అభినవ్‌కు సూచించారు. శనివారం గణిత శాస్త్రం పరీక్ష జరగగా 590 మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజరయ్యారని, 587మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఎంఈవో దేవానాయక్ తెలిపారు.

## ముక్కుడు పోశమ్మ ఆలయంలో నాగుపాము దర్శనం



దేవాలయంలో నాగుపాము

మంగపేట, మార్చి 23: మండలంలోని కోమటిపల్లి అటవి సమీపంలో గౌరారం వాగు ఒడ్డున వెలిసియున్న వన దేవతలైన శ్రీ నాగులమ్మ, ముక్కుడు పోశమ్మ, సారలమ్మ దేవాలయంలో శనివారం ఉదయం నాగుపాము దర్శనమిచ్చింది. గర్భాలయంలోని పుట్టలో నుంచి సుమారు 10 అడుగుల పాము బయటకు వచ్చి గుడి మొత్తం కలియ తిరిగింది. ఆలయ దేవరబాల (ప్రధాన పూజారి) కాయం బాయమ్మ గుడి తలుపులు తీసి చూడగా పాము బుసలు కొడుతూ కన్పించింది. కొద్ది సేపటి తర్వాత తిరిగి పుట్టలోకి ప్రవేశించింది. అనంతరం గుడిని పూజారులు శుభ్రం చేశారు. వనదేవతలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నైవేద్యాన్ని సమర్పించారు. పాముల రూపేణా శ్రీ ముక్కుడు పోశమ్మ సంచరించిందని ప్రచారం జరగ్గా కొందరు భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకొని తిరిగి వెళ్లారు.

## 'రియల్టర్లపై చర్యలు తీసుకోవాలి'

ములుగు కలెక్టరేట్, మార్చి 23: ములుగు జిల్లా కేంద్రంలోని లోకంచెరువు ఆయకట్టు పరిధి వ్యవసాయ పంట పొలాలకు సంబంధించిన కాల్వలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధ్వంసం చేశారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సామాజిక లంబాడీ న్యాయవేదిక జిల్లా అధ్యక్షుడు పాల్తియా శ్యామ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ములుగులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణానికి చెందిన వర్తక సంఘం వ్యాపారులు లోకంచెరువు పారకం కింద ఉన్న పంట భూములను కొనుగోలు చేసి కాల్వలను ధ్వంసం చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని, ఈవిషయంపై తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా అధికారులు వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంట కాల్వలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సామాజిక లంబాడీ న్యాయవేదిక నాయకులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



సుప్రియ (ఫైల్)

దుగ్గొండి, మార్చి 23 : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన దుగ్గొండి మండలంలోని మైసంపల్లిలో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన అకునూరి రవి, రమ దంపతుల కుమార్తె సుప్రియ (28)కు దుగ్గొండి మండలంలోని మైసంపల్లి గ్రామంలోని వెంగళ సారయ్య, సుభద్ర కుమారుడు కిరణ్‌తో 2016లో వివాహం జరిగింది. సుప్రియకు కుమార్తె హవిశ్యశ్రీ(7), కుమారుడు నక్షత్రదీప్(4) ఉన్నారు. సుప్రియ భర్త కిరణ్ సెల్ సెంటర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం భర్త ఉద్యోగానికి వెళ్లాడు. పిల్లలు ఇద్దరు నల్లబెల్లిలోని ప్రైవేట్ పాఠశాలకు బస్సులో వెళ్లారు. ఇంటిలో సుప్రియ ఒకత్తే ఉంది. ఇల్లు ఊరుకు చివరన ఉంటుంది. బడికివెళ్లిన పిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటిలో తల్లి చనిపోయి ఉంది. అమ్మ అని ఎంత పిలిచినా పలుకక పోవడంతో, పిల్లలు కేకలు వేశారు. గ్రామస్థులు వచ్చి చూడగా మంచంపై సుప్రియ విగత జీవిగా ఉన్నది. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుప్రియ ముఖం, శరీరంపై కాట్లు ఉన్నాయి. సుప్రియ చెవులకు ఉన్న బంగారం కమ్మలు, పుస్తేలు తాడు (మంగళసూత్రం) ఎత్తుకొని పోయాడు. ఇంటిలో బీరువా పగుల కొట్టినట్లు ఉన్నది. దీంతో గుర్తు తెలియని వ్యక్తికి చోరీకి రావడతో అతనితో సుప్రియ గోడవ పడడంతోనే తమెను కొట్టి దిండుతో మెడపై ఉంచి చంపారని గ్రామస్థులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. సంఘటన స్థలానికి ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రాజగోపాల్, ఎస్సై పరమేశ్‌లు చేరుకొని డ్వాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టి, దర్యాప్తు చేస్తున్నారు.

## కేజ్రీవాల్, కవిత అరెస్టులు అమానుషం : సీపీఎం

కాకతీయఖని, మార్చి 23: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టులు అమానుషమని సీపీఎం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి సాయిలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను ప్రధాని నరేంద్రమోదీ నొక్కుతున్నారని విమర్శించారు. సీబీఐ, ఈడీలను తమ జేబు సంస్థగా మలుచుకున్నారని ఆరోపించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## సర్వాయిపేటలో కలప పట్టివేత



స్వాధీనం చేసుకున్న కలపతో అటవీశాఖ అధికారులు

మహదేవపూర్ రూరల్, మార్చి 23: పలిమెల మండల పరిధిలోని సర్వాయిపేట గోదావరి నది తీర ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీశాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం తనిఖీలకు వెళ్లిన అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు టేకు దుంగలను గుర్తించారు. కలపను స్వాధీనం చేసుకొని మహదేవపూర్ కలప డిపోకు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈతనిఖీల్లో పలిమెల రేంజ్ అధికారి వెంటేశ్వర్‌రావు, సెక్షన్ అధికారులు కృష్ణ, రాజేందర్, బీట్ అధికారులు సదానందం, నాగరాజు, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి



హేమాచల స్వామి వారి గర్భాలయం వద్ద భక్తులు

మంగపేట, మార్చి 23: మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహ్వామి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వరంగల్, హనుమకొండ, ఖమ్మం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. చింతామణి జలధారల వద్ద పుణ్యస్నానాలను ఆచరించి జలాంజనేయ స్వామి, పంచముఖాంజనేయ స్వామిని, రమ సత్యనారాయణ స్వామిని, వేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు దైవ దర్శనాలు గావించి, తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టత, స్వామివారి చరిత్రను వివరించారు.

## ఘనంగా బోనాల జాతర



గంగబోనంతో ఊరేగింపుగా వెళ్తున్న యాదవులు, కురుమలు

కాటారం, మార్చి 23: మండలంలోని కాటారం జీపీ పరిధిలో అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన బీరన్న పట్నాలు, మహంకాళి బోనాల జాతర ఘనంగా సాగుతున్నాయి. రెండో రోజు శనివారం పలువురు యాదవులు, మహిళలు ఒగ్గు, కురుమ కళాకారుల విన్యాసాలతో గంగబోనం ఊరేగింపు చేపట్టారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి నుంచి గారెపల్లి చింతల చెరువు వరకు వందలాది మందితో డమరుకాల చప్పుళ్ల మధ్య వెళ్లి చెరువులో నుంచి దేవుళ్ల విగ్రహాలను తీసి బీరన్న దేవుడి ఆలయానికి చేర్చారు. వారం రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పట్నాలు, బోనాల జాతరలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించాలని యాదవ సంఘం నేతలు, జాతర నిర్వాహకులు కోరారు.

# చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

**ములుగు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ**

ములుగు కలెక్టరేట్, మార్చి 23: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ అన్నారు. ములుగులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం ఐసీడీఎస్ అధికారి స్వర్ణలత లెనిన అధ్యక్షతన శనివారం జరగగా మహేందర్‌జీ ముఖ్య అతిథిగా మహేందర్‌జీ హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషణ ఆహార లోపం లేకుండా చూడడం కోసం పోషణ పక్వాడ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహారం అందించాలని అన్నారు. అనంతరం చిరుధాన్యాలు, ఆకుకూరలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను మహేందర్‌జీ పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 640 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బాలామృతంతోపాటు పౌష్టికాహారాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి తుల రవి, జిల్లా మైనారిటీ అధికారి ప్రేమలత, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చిరుధాన్యాలు, కూరగాయల స్టాళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

## భగత్‌సింగ్‌కు ఘన నివాళి

భూపాలపల్లిటౌన్, మార్చి 23: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని భూపాలపల్లి పట్టణంలో జరిగింది. భగత్‌సింగ్ విగ్రహానికి ఆ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జేరిపోతుల సనత్‌కుమార్, హరీశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

- చిట్యాల: మండల కేంద్రంలోని కాకతీయ పాఠశాలలో షహీద్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాట యోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌మహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- కాకతీయఖని : భగత్‌సింగ్ వర్ధంతిని ఏఐఎస్ఎఫ్ నాయకులు భూపాలపల్లిలోని రావినారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి జోసఫ్, నాయకులు వెంకటేశ్, శ్యామ్, క్రాంతి, రాజ్‌కుమార్, లావణ్య, శ్రావణి, చందన తదితరులు పాల్గొన్నారు.
- ములుగు కలెక్టరేట్ : భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ వర్ధంతిని ములుగులో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏరియా వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 30 మంది యువత రక్తదానం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎమ్డీ.గఫూర్‌పాషా, ప్రజా సంఘాల నాయకులు కొర్ర రాజు, జి.రాజు, వీరస్వామి, బద్రి, చలపతి, రాము, వెంకన్న, రత్నం రాజు, సాయితోపాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.
- కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయి గూడెం కమ్యూనిటీ హాల్‌లో భగత్‌సింగ్ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.డి.దావూద్, నాయకులు కావిరి సుధాకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పూర్తి

మొగుళ్లపల్లి, మార్చి 23: మండలంలోని జడ్పీహెచ్ఎస్, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 35 ఉండగా ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీ కాలపరిమితి రెండు సంవత్సరాలు కాగా పాఠశాల పరిధిలోని గ్రామాల్లో ఉన్న స్వయం సహాయక గ్రూపు అధ్యక్షురాలు పాఠశాల ఛైర్మన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, ఐదు తరగతులకు కలిపి మొత్తం 15మంది కమిటీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో విధిగా పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. .

## పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

మొగుళ్లపల్లి, మార్చి 23: మండలంలోని మేదరమెట్ల, అంకుశాపురం, చింతలపల్లి, నర్సింగాపురం, కాసులపాడు, బంగ్లపల్లి, గుడిపాడు గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం శనివారం జరిగింది. ఈసందర్భంగా పశువైద్యాధికారి శ్రీరామ్‌నాయక్ సుమారు 50 పశువులకుపైగా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్రలు, పశు పోషకులు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపు



శిఖం భూమిలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 23: జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్ శివారు గోరంట్ల శిఖం భూమిలో ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా నిర్మించిన రోడ్డు, కల్వర్టును నీటిపారుదల శాఖ శనివారం ధ్వంసం చేశారు. చెరువుల ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నీటిపారుదల శాఖ ఈఈ వెంకటేశ్వర్లును హెచ్చరించారు. గోరంట్ల శిఖం కబ్జాలపై ఉన్నతాధికారులకు పూర్తి స్థాయిలో నివేదిక అందించామన్నారు. ఈ ఆక్రమణల తొలగింపులో ఐబీ డీఈ బసవ ప్రసాద్, ఏఈ షరీఫొద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జోరందుకున్న ఉపాధి హామీ పనులు

కాటారం, మార్చి23: మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. శనివారం 1,500 మందికి పైగా కూలీలు పనులు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇటీవలి వరకు 500-1000 మంది కూలీలు మాత్రమే పనులకు హాజరుకాగా వారి సంఖ్య పెరుగుతోందని ఏపీవో వెంకన్న తెలిపారు. పలు గ్రామాల పరిధిలో పర్క్యులేషన్ ట్యాంకుల్లో పూడికతీత, ఫిష్ పాండ్ పనులు నిర్వహిస్తున్నారు. అటవీ ప్రాంతం సమీప జీపీల పరిధిలో ఖండిత కందకాలు(స్టాగర్డ్ ట్రెంచెస్) చేపడుతున్నారు. మిర్చి ఏరడం, పొలాల్లో కలుపుతీయడం తదితర వ్యవసాయ పనులు ఉండటంతో కూలీలు ఈజీఎస్ పనులకు పెద్ద సంఖ్యలో రావడం లేదని అధికారులు తెలిపారు. మరో నాలుగైదురోజుల్లో 3 వేలకు పైగా కూలీలు రానున్నట్లు వెల్లడించారు. దీంతో పనులు కావాలని కూలీలు కోరిన చోట డిమాండ్‌కు తగినట్లు పనులు చేపట్టాని ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలను ఎంపీడీవో అడ్డూరి బాబు, ఏపీవో వెంకన్న ఆదేశించారు.

- మహదేవపూర్ రూరల్ : వేసవిలో కూలీలంతా ఉపాధిహామీ పనులను వినియోగించుకోవాలని పలిమెల ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. పలిమెల మండల పరిధిలోని దమ్మూరు గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఎండదెబ్బ తగలగకుండా జాగ్రత్తలు పాటించాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఏపీవో సునీత, ఈసీ, పీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.
- రేగొండ : ప్రభుత్వం కల్పించిన ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని పూర్తి చేసుకున్న కూలీలకు లబ్ధి చేకూరుతుందని అడిషనల్ పీడీ వసుమతి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. 100రోజుల పని పూర్తి చేస్తే ఉన్నతి పథకం ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు, ఉపాధి అవ కాశాలు కల్పిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ దాసి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్ బైండోవర్

టేకుమట్ల, మార్చి 23: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అంకుషాపురం గ్రామానికి చెందిన రౌడీషీటర్ అల్లం అశోక్‌ను తహసీల్దార్ విజయలక్ష్మి ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలకు పాల్పడొద్దని హెచ్చరించారు.

## తాగునీటి సౌకర్యం కల్పించాలి

కన్నాయిగూడెం, మార్చి 23 : మండల పరిధిలో ఉన్న భూపతిపూర్, మల్కపల్లి, గుట్టలగంగారం తదితర వలస ఆదివాసి గూడాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా సభ్యుడు రత్నం రాజేందర్, నాయకులు సుధాకర్, సడువలి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.